క్లుప్తంగా

సీహెచ్‌ఓల సమ్మెతో రోగులకు ఇబ్బందులు



విజయవాడరూరల్: జాతీయ ఆరోగ్య మెషిన్ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నారు. వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని విజయవాడ రూరల్ మండలంలో 23 కేంద్రాల్లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సమ్మె చేస్తున్నారు. 23 శాతం వేతన సవరణ చేయాలని, ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, గత 8 నెలలుగా ఉన్న పెండింగ్ ఇన్సెంటివ్స్, హెల్త్ క్లినిక్ అద్దె బకాయిలు చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ విధులకు గైర్హాజరవడంతో గ్రామాల్లో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లకు వచ్చే బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలు, సరైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

పింఛన్ల పంపిణీ పేరుతో మోదీ సభకు ప్రచారం



భవానీపురం(విజయవాడపశ్చిమ): సామాజిక పింఛన్ల పంపిణీ సాకుతో ఇంటింటికీ తిరిగి శుక్రవారం అమరావతిలో జరుగనున్న ప్రధాని మోదీ సభకు భారీగా తరలి రావాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ చేస్తున్న ప్రచారం చూసి లబ్ధిదారులు నివ్వెరబోతున్నారు. గురువారం గొల్లపూడిలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితతోపాటు స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. పనిలో పనిగా వసంత కృష్ణప్రసాద్ అమరావతి పనుల పునఃప్రారంభానికి వస్తున్న ప్రధాని మోదీ కార్యక్రమానికి గొల్లపూడి గ్రామం నుంచి పెద్దఎత్తున తరలి రావాలని ప్రచారం మొదలు పెట్టారు. పైగా మైలవరం నియోజకవర్గం కూడా అమరావతిలో భాగమేనని లబ్ధిదారులతోపాటు ప్రజలకు చెప్పుకొచ్చారు. సందట్లో సడేమియా అంటే ఇదేనని ప్రజలు నవ్వుకుంటున్నారు. కార్యక్రమంలో బొమ్మసాని సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ నర్రా వాసు, నారద, అక్కల గాంధీ, నూతలపాటి బాల తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌కు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ నాయకుడు లేళ్లపూడి లాజర్‌ను ఆ పార్టీ పీఏసీ మెంబర్, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. లాజర్ తల్లి సంతోషమ్మ (90) గురువారం మృతి చెందారు. సమాచారం తెలిసిన వెలంపల్లి లాజర్ నివాసానికి వచ్చి సంతోషమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం లాజర్ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించినవారిలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి జయప్రకాష్ కెనడి, జిల్లా అధికార ప్రతినిధి పొదిలి చంటిబాబు, విశ్వనాథ రవి, మస్తాన్, ఎస్సీ నాయకులు కాలే పుల్లారావు, మంటి కోటేశ్వరరావు, గోమతోటి వినోద్ పాల్, కామా దేవరాజ్, కర్రె రమేష్, మంటి రాము, రుద్రశంకర్, జీ నవీన్, మధిర ప్రభాకర్, చలపతిరావు, కరీం, ఎం.దుర్గారావు ఉన్నారు.

యోగా శిక్షణ శిబిరం ప్రారంభం



ఇబ్రహీంపట్నం: ప్రతి రోజు యోగా సాధన చేయడం ద్వారా ప్రశాంతమైన జీవనం అలవడుతుందని యోగా గురువు లంకే జనార్దన్ అన్నారు. శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏకాలనీలో ఉచిత యోగా శిక్షణ శిబిరం గురువారం ప్రారంభమైంది. యోగా జీవనం సనాతన సంప్రదాయానికి, సంస్కృతికి నిదర్శనమన్నారు. యోగా సాధకులతో సూక్ష్మ వ్యాయామాలు, యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామం చేయించారు. తొలుత జి.సుబ్రహ్మణ్యం జ్యోతి ప్రజ్వలన చేసి యోగా శిబిరం ప్రారంభించారు. మున్సిపల్ కౌన్సిలర్ విజయలక్ష్మి, ఏఈఈ ఎ.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అరకొరగా పూడికతీత పనులు



పాతబస్తీలోని ప్రధాన అవుట్‌ఫాల్ డ్రెయిన్



అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో గాంధీహిల్ వద్ద చెత్త తొలగించే యంత్రం

- పాతబస్తీ అవుట్‌ఫాల్ డ్రెయిన్ల నిర్వహణపై నిర్లక్ష్యం
- ఏటా తూతుమంత్రంగా పూడిక తీత పనులు
- చిన్నపాటి వానకే రోడ్డుపై వర్షం నీరు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని ప్రధాన అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్వహణపై నగర పాలకసంస్థ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని స్థానిక ప్రజానీకం ఆరోపిస్తోంది. ఏటా ప్రజలు ఇబ్బంది పడుతున్నా వీఎంసీ అధికారులు అప్పటికప్పుడు హడావుడి చేసి తాత్కాలిక పనులు చేపట్టి పరిస్థితిని అదుపు చేస్తున్నారే తప్ప పూర్తి స్థాయిలో దృష్టి పెట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే నిర్లక్ష్యం కారణంగా 2008లో అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో చెత్త అడ్డుపడి రెండు మూడు రోజులు పాతబస్తీలోని మూడునాలుగు అడుగుల మేర మురుగునీరు నిలిచిపోయింది. పడవలు వేసుకొని తిరిగే పరిస్థితులు దాపురించాయి. అటువంటి పరిస్థితులు ఉన్నా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

80 ఏళ్ల క్రితం నాటి అవుట్‌ఫాల్ డ్రెయిన్

పాతబస్తీలోని బ్రాహ్మణవీధి నుంచి పూలబావి వీధి, సుబ్బరామయ్య వీధి, జెండాచెట్టు సెంటర్, గాంధీహిల్ నుంచి రైల్వే స్టేషన్ ట్రాక్‌ల దిగువ నుంచి వెహికిల్ డిపో తదితర ప్రాంతాల మీదుగా కెనాల్‌లో కలుస్తుంది. బ్రాహ్మణ వీధి నుంచి మొదలయ్యే ఈ అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లోకి వివిధ ప్రాంతాల నుంచి కాలువలు వచ్చి కలుస్తుంటాయి. ఏడెనిమిది పెద్ద డివిజన్లకు చెందిన డ్రెయిన్ల నుంచి వచ్చే మురుగు ఈ ప్రధాన అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో చేరుతూ ఉంటుంది. దీన్ని సుమారుగా 80 ఏళ్ల క్రితం నాటి బ్రిటీష్ పాలకులు ఏర్పాటు చేసినది. అయితే అటువంటి కీలకమైన డ్రైన్ విషయంలో నిర్లక్ష్యం వహించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తి స్థాయి పూడిక తొలగింపు చేయాలి

ఈ ప్రధాన అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో సుబ్బరామయ్య వీధి, డ్రెయిన్ వీధి తదితర ప్రాంతాల్లో మాత్రమే ఏటా పూడిక తొలగింపు పనులు చేపడుతున్నారు. అదికూడా అరకొరగానే నిర్వహిస్తున్నారే విమర్శలు ఉన్నాయి. గాంధీహిల్ నుంచి కెనాల్‌లో కలిసే వరకూ రైల్వే ట్రాక్ దిగువన పూడిక తొలగింపు పనులు ఏళ్ల తరబడి పట్టించుకోకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా 80 ఏళ్ల క్రితం నిర్మాణం చేసిన అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను ఆధునీకరించడంలోనూ నగరపాలకసంస్థ దృష్టి పెట్టకపోవటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై వీఎంసీ అధికారులు ఇప్పటికైనా పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని పాతబస్తీ ప్రజానీకం విజ్ఞప్తి చేస్తోంది.

టెన్త్ విద్యార్థులకు నగదు పారితోషకం అందజేత



నగదు పారితోషకం అందజేస్తున్న ప్రకాశరావు, రమేష్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో చదువుతూ మంచి మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు నగదు పారితోషకం అందజేశారు. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్‌రావు విద్యార్థికి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.20 వేలు ప్రోత్సాహక బహుమతిగా వితరణ చేశారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న లాయర్ కేజేఎస్ ప్రకాశరావు, రాజనీతి శాస్త్రం రిసెర్చ్ అసోసియేట్ డాక్టర్ పారా రమేష్‌లు స్కూల్ టాపర్లుగా నిలిచిన షేక్ ఆయుబ్, గుంటూరు అరవింద్, దారా సుప్రియ, చుక్క శరణ్యలకు నగదు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బోధన, దాతల సహకారంతో పట్టుదలతో కష్టపడి చదువుకుని ఉత్తమ ఫలితాలను సాధించి మిగిలిన విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన నలుగురు విద్యార్థులు అభినందనీయులని కొనియాడారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్న సంకల్పమే వారిని పాఠశాలలో ఉత్తమ విద్యార్థులుగా నిలబెట్టిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు రొంపిచర్ల సత్యనారాయణ, రేయల్లె గోపాలం, దారా నాగేశ్వరరావు, మిరియాల నరసింహారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూచిపూడి తరుణ్ బాబు నిర్వహించారు.

బైక్ ఢీకొని ఆటోడ్రైవర్‌కు గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అతి వేగంతో వచ్చిన బైక్ ఆటోడ్రైవర్‌ను ఢీ కొనడంతో గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామవరప్పాడుకు చెందిన కొల్లిపర సుబ్రహ్మణ్యేశ్వరరావు(67) ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. బుధవారం ఉదయం అతను ఆటో కిరాయికి చిట్టినగర్‌కు వచ్చాడు. కేఎల్ రావు పార్కు వద్ద టిఫిన్ చేసేందుకు రోడ్డు దాటుతుండగా, చిట్టినగర్ నుంచి పాల ప్రాజెక్టు వైపు వస్తున్న బైక్ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో సుబ్రహ్మణ్యేశ్వరరావు కుడికాలు విరిగింది. దీంతో బాధితుడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలి



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న రాయప్ప, నాయకులు



అవగాహన కల్పిస్తున్న మెజిస్ట్రేట్ ఆర్వీ శర్మ



వాగు సెంటర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్కే ఖాదర్‌బాషా పిలుపునిచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా మేడే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఏఐసీటీయూ ఆధ్వర్యంలో మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్, ఇస్లాంపేట తదితర ప్రాంతాల్లో యూనియన్ పతాకాలను ఎగురవేసి, వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదర్ బాషా మాట్లాడుతూ.. అమెరికాలో కార్మికుల శక్తిని దోచుకుంటున్న సమయంలో చికాగో నగరంలో కార్మికులు 8 గంటల పని విధానం కోసం సమ్మె చేసి విజయం సాధించారన్నారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మికులపై కాల్పులు జరిపి చికాగో నగరం రక్తపు టేరులు ప్రవహించాయని చెప్పారు. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత 44 కార్మిక చట్టాలను రద్దు చేసి యజమాన్యాలకు అనుకూలంగా మార్చారన్నారు. నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను తీసుకురావటం ద్వారా ఉద్యోగ, కార్మికవర్గ హక్కులను హరిస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో నాయకులు సలీం, రాచపూడి బాబురావు, ఓంకార్, అజాజ్, సుభాని, వాహేద్, తాజ్, ఉస్మాన్, కామరాజు, రెడ్డి, అమీర్, బాజీ తదితరులు పాల్గొన్నారు

కార్మిక హక్కుల కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలి..

కార్మిక హక్కుల కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని సీపీఐ సీనియర్ నేత, మాజీ కార్పొరేటర్ కొరగంజి దుర్గాంబ అన్నారు. 53వ డివిజన్‌లో ఏఐటీయూసీ స్థానిక డివిజన్ యూనిట్ ఆధ్వర్యంలో చేపలమార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన మేడే వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మేడే విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో కొట్టు రమణ, సీహెచ్ రాజు, బైపిల్ల సత్యనారాయణ, రాయన గురునాథం, ఆర్.శ్రీనివాసరావు, బియ్యపు భాను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూబొమ్మ సెంటర్‌లో....

స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ పిళ్లా రాంబాబు యూనియన్ పతాకాన్ని ఎగురవేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం పోరాడాలన్నారు. కార్యక్రమాన్ని సీపీఎం స్థానిక డివిజన్ కార్యదర్శి కె.సూరిబాబు నిర్వహించారు. గాదె బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవానీపురంలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచ కార్మికుల దినోత్సవం(మేడే) సందర్భంగా గట్టు వెనుక ప్రాంతంలోని నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యాధరపురం చెరువు సెంటర్‌లోని ఉప్పలపాటి సుబ్బరాజు భవన్ వద్ద సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యురాలు పంచదార్ల దుర్గాంబ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, నక్క వీరభద్రరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు సాయికుమార్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు కంచర్ల భార్గవ్, 45వ డివిజన్ సహాయ కార్యదర్శి యరసాని జోసఫ్, స్థానిక నాయకులు ఏవీ రంగారావు, కొత్తపల్లి పిచ్చయ్య, పి.రాణి, నారిండి కిశోర్, వీవీ కృష్ణకిశోర్, డి.దేవానంద్, అప్పాయమ్మ, నూకాలమ్మ, భువన సుందరి, శర్మ తదితరులు పాల్గొన్నారు.

హరిత ఆటో స్టాండ్‌లో..

మేడే వేడుకలను పురస్కరించుకుని భవానీపురంలోని పున్నమి హోటల్ వద్దగల హరిత ఆటో స్టాండ్ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఏపీటీడీసీ విజయవాడ డివిజనల్ మేనేజర్ పి.కృష్ణచైతన్య, బెరంపార్క్, భవానీ ఐలాండ్, బోటింగ్ మేనేజర్లు కె.శ్రీనివాస్, డి.సుధీర్, నాగరాజు, కాంట్రాక్టర్ మన్నం కొండయ్య పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.దుర్గారావు, ఉపాధ్యక్షుడు ఎం.లాజర్, సెక్రటరీ సీహెచ్ సైదా, కోశాధికారి పైడిరాజు, జాయింట్ సెక్రటరీ ఎ.నారాయణ రెడ్డి, గౌరవ సలహాదారు బాబూరావు పాల్గొన్నారు.

వాడవాడలా వేడుకలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మేడే వేడుకలను సీపీఐ, సీపీఎం నేతలు గురువారం ఘనంగా నిర్వహించారు. 46వ డివిజన్‌లోని కేఎల్ రావు పార్కు రోడ్డు వద్ద సీపీఐ కార్యాలయం వద్ద పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. 47వ డివిజన్‌లో ఆర్.ఐజాక్ యూనిట్ వద్ద సీపీఐ నాయకులు ఆర్.యాకోబ్, అల్లీనగర్ యూనిట్ వద్ద షేక్.మహబూబ్, తమ్మిన కనకమ్మ రోడ్డులోని కొండ భాగంలో షేక్. అమీర్, రత్నశేఖర్, పేరం వెంకటేశ్వరరావు వేడుకల్లో పాల్గొన్నారు. గుజ్జారి యల్లారావు యూనిట్ వద్ద డివిజన్ ఇన్‌చార్జి డీవీ రమణబాబు, ఆర్. వెంగమరాజు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. యువజన పతాకాన్ని షేక్.జానీ బాషా ఆవిష్కరించారు. 48వ డివిజన్‌లోని సోరంగం రోడ్డులో సీపీఐ కార్యాలయం వద్ద పార్టీ పతాకాన్ని కరోతి వెంకటేశ్వరరావు, చిట్టినగర్ సెంటర్‌లో డీవీ రమణబాబు, ఆంజనేయవాగు వద్ద నగర కౌన్సిల్ సభ్యులు ఎస్వీ.రమణ, రాయప్పరాజు వీధిలో చిన్నకొండలరావు ఆవిష్కరించారు. పాలప్రాజెక్టు సమీపంలోని దివాకర్‌భవన్‌లో సీపీఎం నాయకులు మేడే వేడుకలను నిర్వహించారు.

ఘనంగా మేడే వేడుకలు..

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): స్థానిక 34వ డివిజన్ సీపీఐ కార్యాలయంలో మేడే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నేత బుట్టి రాయప్ప పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓట్ల రాజకీయాలు, సీట్ల రాజకీయాలకు అతీతంగా పేద వర్గాల సమస్యలపై సుదీర్ఘ పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలుచేసే వరకు తమ పోరాటాలను కొనసాగిస్తామని కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి కోళ్ల చిన్నప్ప, నాయకులు విజయ్, దొడ్డా కుమార్, సీహెచ్ వెలంగణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏడో అదనపు జిల్లా మెజిస్ట్రేట్ రైల్వే న్యాయస్థానం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ప్రాంగణంలో కార్మిక చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మెజిస్ట్రేట్ ఆర్.వి శర్మ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్మికుల పనులు, వారి చట్టాలు, రక్షణకు సంబంధించిన విషయాలను తెలియజేశారు. శ్రమ దోపిడీ, బలవంతంగా ఎక్కువ సమయం పనులు చేయించుకోవడం నేరమని అందుకు పాల్పడిన యాజమన్యంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునే వెలుసుబాటు ఉందన్నారు. దేశ ప్రగతిలో కార్మిక శక్తి ఎంతో ఉందని, అటువంటి కార్మికులకు రాజ్యాంగం కల్పించిన రక్షణ చట్టాల గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కార్మికులతో మాట్లాడి పని ప్రాంతంలో వారి ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుని వారికి పలు న్యాయ సలహాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ పీపీ మురళీ, ఏపీపీ సిద్ధిఖీ, ఆర్పీఎఫ్ కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



ఇస్లాంపేటలో వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు



53వ డివిజన్‌లో..



హరిత ఆటో స్టాండ్ వద్ద..



చెరువు సెంటర్‌లో మజ్జిగ పంపిణీ..



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దుర్గాంబ

ఆదిరాలకు బిరుదు ప్రదానం



ఆదిరాల జయప్రభుకు లలిత కళాగాన కోకిల బిరుదుతో సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సేవా సంస్థ నెలవారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం సినీ సంగీత విభావరి, సీనియర్ గాయకుడు, హిందూస్థానీ సంగీత విద్వాంసుడు ఆదిరాల జయప్రభు పదవీ విరమణ సందర్భంగా ఆత్మీయ సత్కారం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు ఆదిరాల జయప్రభు 35 సంవత్సరాల పాటు నగర పాలక సంస్థలో వివిధ హోదాల్లో పనిచేశారని తెలిపారు. తన సంస్థల ద్వారా అనేకమంది గాయనీ గాయకులను పరిచయం చేసినట్లు పేర్కొన్నారు. సత్కార కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పరుచూరి విజయలక్ష్మి, చింతకాయల చిట్టిబాబు, బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పరపు బలరామ కృష్ణమూర్తి, గాయని ఉమా బలరాం అంబేడ్కర్ సేవా సంస్థ సభ్యులు వెంకటపతి, వీరభద్రరావు, మారేపల్లి జోషి తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. నిర్వాహకులు ఆదిరాల జయప్రభను లలిత కళాగాన కోకిల బిరుదుతో సత్కరించారు.

గ్రంథాలయానికి పుస్తకాలు, కలర్ పెన్సిల్స్ బహూకరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొనే చిన్నారులకు ఉపయోగపడేలా పుస్తకాలు, కలర్ పెన్సిల్స్, క్రేయాన్స్ బహూకరించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు చిన్నారుల కోసం ఆయా వస్తువులను అందజేశారు. శిక్షణ సమయంలో అందించేందుకు బిస్కెట్స్, చాక్లెట్స్ అందించారు. తరచూ గ్రంథాలయానికి వచ్చే తాము ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతో చిన్నారులకు ఉపయోగపడేలా మెటీరియల్ అందజేసినట్లు విద్యార్థులు తెలియజేశారు. శ్రావణి, శృతి, చైతన్య బాలాజీ, శివకామేశ్వరి, అవినాష్, కళ్యాణి, అయ్యప్ప, భార్గవి చిరంజీవులు ఆద్య, సాత్విక, నైతిక్, సాయి సంయుక్త , సాయి అక్షర తదితరులు మెటీరియల్ బహూకరించిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.నాగరాజు, కె.రమాదేవి, విద్యార్థులు, పాఠకులు, చిన్నారుల తల్లితండ్రులు, గ్రంథాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్న వారికి చేయూత అందించాలి



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కష్టాల్లో ఉన్న వారికి సహాయం చేయడం వల్ల నిజమైన సంతోషం కలుగుతుందని వైఎన్నార్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ చెప్పారు. స్థానిక 8వ డివిజన్ ఐటీఐ కళాశాల దగ్గర నివాసం ఉంటున్న విభిన్న ప్రతిభావంతుడు గుడివాడ రాజేష్ దంపతులకు జీవనోపాధి నిమిత్తం రూ.25 వేలు విలువ చేసే బడ్డికొట్టును యలమంచిలి జయప్రకాష్ గురువారం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతుడైన రాజేష్ తన కుటుంబసభ్యులతో వచ్చి తనకు జీవనోపాధి కష్టంగా ఉందని తనను సంప్రదించాడని, వారికి జీవనోపాధి కోసం వైఎన్నార్ చారిటీస్ ద్వారా బడ్డికొట్టును అందచేస్తున్నామని చెప్పారు. తమ దగ్గర ఉన్న దాంట్లోనే తోటి వారికి సహాయం చేసే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని చెప్పారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపకుడు పుట్టగుంట రమేష్, స్థానికులు పొట్లూరి రవి, జి.వాసు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ వెంకయ్య స్వామి టెంపుల్ ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా శుక్రవారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ పి. రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయిపురం కాలనీ, సాహితీ విల్లాస్, వెంకయ్య స్వామి టెంపుల్ రోడ్డు, చెట్ల బజార్, ఎండోమెంట్ ఆఫీస్, బ్రాహ్మణ కార్పొరేషన్ ఆఫీస్, వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్, మురళి ఐస్ ప్లాంట్, నార్త్ ఫేస్ అపార్ట్‌మెంట్, లాంకో కాలనీ, జీబజీ స్కూల్, మురళీకృష్ణ టింబర్ డిపో ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీసీ చైతన్య సంక్షేమ సంఘం స్వాగతిస్తుందని సంఘం వ్యవస్థాపకురాలు వేముల బేబీ రాణి తెలిపారు. గాంధీనగర్‌లోని ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జనగణనతో పాటు కులగణన జరగాలని 50 ఏళ్లుగా బీసీ సంఘాలు చేస్తున్న పోరాటాలు ఫలించాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీసీలందరూ స్వాగతిస్తున్నారన్నారు. కులగణనతో బీసీల్లో అట్టడుగున ఉన్న 139 కులాల్లో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో బీసీ నాయకులు తోలేటి శ్రీకాంత్, పెంటి శ్రీనివాసరావు, బట్టు లక్ష్మయ్య, చేవూరి రమేష్, అప్పలబత్తుల శివశ్రీ, సోమాచారి, పాండురంగాచారి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.